క్లుప్తంగా

సీసీ రోడ్డు వేయాలంటూ సర్పంచుకు వినతి



సర్పంచుకు వినతిపత్రం అందజేస్తున్న మహిళలు

కోడుమూరు రూరల్: పట్టణంలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఎదురుగా ఉన్న కాలనీలో సీసీ రోడ్డు వేసి తమ సమస్యను పరిష్కరించాలంటూ కాలనీకి చెందిన మహిళలు సోమవారం సర్పంచు భాగ్యరత్నకు వినతిపత్రం అందజేశారు. తమ ఇళ్లకు వెళ్లే రహదారి గుంతలమయంగా మారిందని, చిన్న పాటి వర్షానికి గుంతల్లో నీళ్లు చేరి బురదలో నడవలేని పరిస్థితి నెలకొంటుందని, సిమెంట్ రోడ్డు వేసి తమ సమస్యను పరిష్కరించాలని మహిళలు కోరగా ఆమె సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో వార్డు మెంబర్ డిష్ రవి, కాలనీవాసులు అరుణ, సురక్షిత, జయలక్ష్మి, పార్వతమ్మ, భారతి పాల్గొన్నారు.

విద్యార్థిని కుటుంబానికి చెక్కు



చెక్కు అందజేస్తున్న డీఈఓ శామ్యూల్‌పాల్, ఎమ్మెల్యే దస్తగిరి

సి.బెళగల్: చెట్టు కూలి పడిన ప్రమాదంలో గాయపడి మృతిచెందిన పోలకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని శ్రీలేఖ కుటుబ సభ్యులకు అధికార యంత్రాంగం నష్ట పరిహార చెక్కు అందజేసింది. సోమవారం డీఈఓ శామ్యూల్ పాల్, ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, ఎస్ఎస్ఏ ఏపీఓ శ్రీనివాసులు గ్రామానికి చేరుకుని హెచ్ఎం రమ, ఉపాధ్యాయులు, స్థానికులతో కలిసి మృతురాలి కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల చెక్కును అందజేశారు. కుటుంబ సభ్యులను ఓదార్చి, సానుభూతి తెలిపారు. అనంతరం పాఠశాలకు చేరుకున్న వారు అక్కడ ఏర్పాటు చేసిన సంతాప కార్యక్రమంలో శ్రీలేక చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు.

ప్రజలకు, రైతులకు అందుబాటులో ఉండండి

గడివేముల: వివిధ పనుల నిమిత్తం వచ్చే రైతులు, ప్రజలకు కార్యాలయాలలో అందుబాటులో ఉండాలని, త్వరగా పనులు పూర్తి చేయాలని తహసీల్దార్ వెంకటరమణ సూచించారు. గడివేములలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం పీజీఆర్ఎస్ అనంతరం వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజలు, రైతుల నుంచి పీజీఆర్ఎస్ కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు త్వరగా పరిష్కారం చూపి వారికి తెలియజేయాలన్నారు. విధుల పట్ల అలసత్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

తేనె సేకరణపై శిక్షణ

పాణ్యం: మండల పరిధిలోని బపలనూరు మెట్ట వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన నల్లమల హనీ బీ పార్క్‌ను నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి సోమవారం ప్రారంభించారు. ఈ కేంద్రంలో 40–50 రకాల తేనెలు ఉన్నాయి, తేనటీగల ద్వారా తేనె సేకరించి విక్రయడం, కొత్తగా సాగుపై ఇక్కడ శిక్షణ ఇవ్వనున్నారు. రైతులకు, విద్యార్థులకు, వ్యవసాయ రైతులకు, తేనె సాగు చేయాలనుకునే వారికి ఈ కేంద్రం ఎంతో ఉపయోగపడుతుంది. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ తెలుగు రమేష్, ఇలియాస్, సిమెంట్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



డ్రైవర్లకు మందులను అందజేస్తున్న జేఎస్ డబ్ల్యూ ప్లాంట్‌హెడ్ నవనీత్ కుమార్ చౌహాన్

గడివేముల: మండల పరిధిలోని జెఎస్‌డబ్ల్యూ సిమెంట్ ఫ్యాక్టరీ ఆధ్వర్యంలో డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరం సోమవారం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని ప్లాంట్‌హెడ్ నవనీత్ కుమార్ చౌహాన్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వివిధ కార్పొరేట్ ఆసుపత్రుల డాక్టర్ల ఆధ్వర్యంలో 1,200 మంది డ్రైవర్లకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించామన్నారు. అవసరమైన ఉచితంగా కంటి అద్దాలు అందజేస్తామని చెప్పారు. డ్రైవర్లు అధికారులు సూచించిన ప్రకారం రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు. డ్రైవర్లందరూ కచ్చితంగా ప్రమాద బీమా చేసుకోవాలని సూచించారు. అనంతరం అవసరమైన వారికి మందులను అందజేశారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ మేనేజర్ రవికుమార్, టెక్నికల్ హెడ్ సంజయ్ శర్మ, లాజిస్టిక్ హెడ్ వెంకటాచలం, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



అగ్రహారంలో వీధులు



అగ్రహారంలోని మంచినీటి బావి



ధాన్యం దాచుకునేందుకు ఏర్పాటు చేసుకున్న గాదె

చెదిరిపోనున్న ఆనవాళ్లు!

- ఒకప్పుడు కొండపై వెలసిన అగ్రహారం, కొట్టాల, దొడ్డిపాడు గ్రామాలు
- నీటి సమస్యతో 40 ఏళ్ల క్రితం గ్రామాలు ఖాళీ
- పిన్నాపురం, తమ్మరాజుపల్లెలకు ప్రజల వలస
- ప్రస్తుతం ఆ మూడు గ్రామాల పరిధిలో సోలార్ పరిశ్రమ ఏర్పాటు
- ముమ్మరంగా రోడ్లు, భూమి చదును పనులు



భారీ కొండల మధ్య వేసిన రోడ్డు



కొండల్లో జరుగుతున్న బ్లాస్టింగ్

పాణ్యం: మండలంలో పరిధిలోని ఒకప్పటి అగ్రహారం, దొడ్డిపాడు, కొట్టాల గ్రామాల ఆనవాళ్లు చెదిరిపోనున్నాయి. సోలార్ పరిశ్రమ విస్తరణలో భాగంగా ఆయా గ్రామాల పరిధిలో కంపెనీవారు భారీగా భూములు కొనుగోలు చేశారు. ఈ మేరకు సోలార్ ప్లేట్లు అమర్చేందుకు భూములు చదును చేసే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. దీంతో మరికొద్ది రోజుల్లో ఈ మూడు గ్రామాలకు సంబంధించిన ఆనవాళ్లు కనుమరుగు కానున్నాయి.

40 ఏళ్ల క్రితం గ్రామాలు ఖాళీ

పిన్నాపురం రెవెన్యూ పరిధిలో 40 ఏళ్ల క్రితం వరకు అగ్రహారం, దొడ్డిపాడు, కొట్టాల గ్రామాలు ఉండేవి. వీటికి సంబంధించి నేటికీ ఆనాటి ప్రజలు నివసించిన ఇళ్ల గోడలు, పండించిన పంటలను దాచుకునేందుకు నిర్మించుకున్న గాదెలు, మంచినీటి కోసం తవ్వకున్న బావులు, ప్రజలు సాగు చేసుకునే వ్యవసాయ పొలాలు కనిపిస్తాయి. ఈ గ్రామాల ఆనవాళ్లు చూడాలంటే తమ్మరాజుపల్లె గ్రామం నుంచి వెనుక భాగంలో ఉన్న కొండలపైకి కాలినడక చేరుకోవాల్సి ఉంటుంది. పిన్నాపురం గ్రామం నుంచి అయితే దాదాపు కొండల్లో 10కిలో మీటర్ల దూరం వెళితే ఈ అనవాళ్లు కనిపిస్తాయి. ఈ మూడు గ్రామాల ప్రజలు దాదాపు 40 ఏళ్ల క్రితం తీవ్ర నీటి సమస్య, దారి సమస్యతో క్రమంగా ఊరు విడిచి వెళ్లిపోయారు. ఆయా గ్రామాల ప్రజలు తమ్మరాజుపల్లె, ఎల్‌కే తండా గ్రామాల్లో స్థిరపడ్డారు. నేటికీ వారు జీవించిన తీరు.. వారు కట్టకున్న ఇళ్లు, గ్రామాల సమీపంలో సుంకులాపరమేశ్వరి అమ్మవారి ఆలయం, కొండ మల్లేశ్వరస్వామి ఆలయం ఉంది.

విస్తరిస్తున్న సోలార్ పరిశ్రమ..

ఆసియా ఖండంలోనే అత్యంత పెద్దదిగా ఇక్కడి సోలార్ పరిశ్రమ విస్తరిస్తోంది. ప్రస్తుతం పిన్నాపురం పరిధిలో మొత్తం 6714.91ఎకరాల భూమి ఉంది. పట్టా భూమి 874.83 ఎకరాలు, అసైన్డ్ భూమి 773.49 ఎకరాలు, పోరంబోకు భూమి 22.11 ఎకరాలు, ఏడబ్ల్యూ భూమి 5044.48 ఎకరాలు భూమి ఉంది. అయితే ఇప్పటి వరకు సోలార్ పరిశ్రమ వారు 343 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. మరో 300 ఎకరాలు కొనుగోలు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. అసైన్డ్ భూములు 464, ఏడబ్ల్యూ భూమి 3,020 ఎకరాల భూమిలో సోలార్ పరిశ్రమ విస్తరిస్తోంది. పనులు వేగంగా జరుగుతున్నాయి. కొండలను సైతం పిండి చేసి ఆ మూడు గ్రామాల వరకు రోడ్డు వేశారు. రైతులు సాగు చేసుకునే పొలాలను భారీ యంత్రాల సహాయంతో చదును చేసే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మరి కొద్ది రోజుల్లో ఈ మూడు గ్రామాల ఆనవాళ్లు కూడా చెదిరిపోయే అవకాశం ఉంది.

తీవ్ర నీటి సమస్యతో ఖాళీ చేశారు



దాదాపు 40 ఏళ్ల క్రితం ఉన్న దొడ్డిపాడు, కొట్టాల, అగ్రహారం గ్రామాలు క్రమంగా ఖాళీ అయ్యాయి. ఆ కాలంలో మూడు గ్రామాల్లో అధికంగా పశువులపై ఆధారపడి జీవించే వారు. ఏదైనా గ్రామాల వెళ్లాలంటే తమ్మరాజుపల్లె గ్రామం వద్ద ఉన్న బండ్ల కనుమ వద్ద నుంచి కొడల్లోనే వెళ్లేవారు. కాలినడక తప్ప ఎలాంటి రవాణా ఉండేది కాదు. రానురాను నీటి కొరత ఏర్పడడంతో ఆయా గ్రామాల ప్రజలు తమ్మరాజుపల్లె, ఎల్‌కే తండా గ్రామాలకు వలస వెళ్లి స్థిరపడ్డారు. నేటికీ ఆనాడు ప్రజలు నివసించిన ఇళ్లు ఉన్నాయి. నేడు ఆ గ్రామాల్లో సోలార్ పరిశ్రమ పనులు ప్రారంభించారు.

– గువ్వల వెంకటయ్య, మాజీ సర్పంచ్ పిన్నాపురం

కోలుకోలేక వ్యక్తి మృతి

పాణ్యం : మండల పరిధిలోని తమ్మరాజుపల్లె వద్ద టిప్పర్ ఢీకొని తీవ్రంగా గాయపడిన బొలెరో డ్రైవర్ కోలుకోలేక మృతి చెందినట్లు ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు నంద్యాల పట్టణం టెక్కెకు చెందిన చాకలి మునెప్ప(20)బొలెరో డ్రైవర్‌గా పని చేస్తున్నారు. ఆదివారం డోన్ నుంచి నంద్యాలకు టమాట పండ్ల లోడ్ తీసుకెళ్తూ తమ్మరాజుపల్లె వద్ద లోడ్‌కు బిగించిన తాళ్లను సరి చేస్తుండగా వెనుక నుంచి టిప్పర్ ఢీకొంది. ఘటనలో చాకలి మునెప్ప తీవ్రంగా గాయపడడంతో జీజీహెచ్ నంద్యాలకు తరలించారు. కొలుకోలేక సోమవారం మృతి చెందినట్లు ఎస్ఐ చెప్పారు. మృతుడి భార్య సుమలత, కుమార్తె సంతానం. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

ఉరుసు ప్రారంభం

ఓర్వకల్లు : మండల కేంద్రమైన ఓర్వకల్లు గ్రామంలో వెలసిన హజరత్ సయ్యద్ సుల్తాన్ మహమూద్‌షా ఖాద్రీ ఉరుసు మహోత్సవాలు సోమవారం భక్తిశ్రద్ధల మధ్య ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా రాత్రి సత్సంగం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గురువుల వారి ఇంటి వద్ద నుంచి భక్తజన బృందంతో మేళతాళాల మధ్య దర్గాకు చేరుకున్నారు. స్వాముల వారి సమాధికి గంధం పూసి పూలచాదర్‌తో అలంకరించారు.

బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో మార్చి 1 నుంచి 8వ తేదీ వరకు జరిగే మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా బాల్య వివాహాలకు వ్యతిరేకంగా పోస్టర్‌పై సంతకాల సేకరణ, అధికారులతో ప్రతిజ్ఞ కార్యక్రమాలు చేపట్టారు. 'ఆడపిల్లను రక్షిద్దాం–ఆడపిల్లను చదివిద్దాం' అనే నినాదంతో ఏర్పాటు చేసిన సంతకాల సేకరణపై కలెక్టర్ సంతకం చేసి కలెక్టరేట్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కల్యాణి, డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ, ఐసీడీఎస్ పీడీ నిర్మల పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం



అర్జీలు పరిశీలిస్తున్న తహసీల్దార్ టీవీ రమేష్‌బాబు

కర్నూలు(రూరల్): సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కర్నూలు రూరల్ తహసీల్దార్ టీవీ రమేష్ బాబు తెలిపారు. తన కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యలు పరిష్కర వేదిక నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల ఫిర్యాదులు స్వీకరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పరిశీలించి వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన అధికారులతో మాట్లాడుతూ ప్రజల వినతుల పరిష్కారంపై దృష్టి సారించాలని ఆదేశించారు.

కళాశాలల నుంచి వ్యర్థాలు రాకుండా చూడాలి

కల్లూరు: దూపాడు సమీపంలోని కేవీ సుబ్బారెడ్డి, అశోకా మహిళా ఇంజినీరింగ్ కళాశాలల నుంచి వ్యర్థ పదార్థాలు, మురుగు నీరు హంద్రీనదిలోకి రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రామకృష్ణ, నాయకులు కృష్ణ, మధు డిమాండ్ చేశారు. సోమవారం గ్రామస్తులతో కలసి సీపీఎం నాయకులు తహసీల్దార్ కార్యాలయాన్ని దిగ్బంధం చేశారు. వారు మాట్లాడుతూ గత రెండు రోజులుగా ఆ కళాశాలల వద్ద దీక్షా శిబిరం నిర్వహించామని, అయినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఆ కళాశాలల నుంచి వచ్చే వ్యర్థపదార్థాలు, మురుగు నీరు హంద్రీలోకి రావడంతో గ్రామానికి తాగునీరు అందించే రింగుబావి నీరు కలుషితమవుతుందన్నారు. నీరు కలుషితం కావడంతో గ్రామంలో ప్రజలు వాంతులు, విరోచనాలు, విష జ్వరాలతో అనారోగ్యానికి గురవుతున్నారని చెప్పారు. దూపాడు గ్రామాన్ని కర్నూలు కార్పొరేషన్‌లో విలీనం చేశారు కానీ, కనీస మౌలిక సౌకర్యాలు లేకపోవడంతో ప్రజలందరూ ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతరం తహసీల్దార్ ఆంజనేయులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్లా, జిల్లా ఉపాధ్యక్షుడు సాయి ఉదయ్, హరిబాబు, షేక్షావలి, ఈశ్వర్, వినోద్, గాలేన్న, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

ఇంటి వద్దే పరీక్షలు నిర్వహించాలి

కోడుమూరు రూరల్: సంచార వైద్య చికిత్స కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బంది ప్రజల ఇంటి వద్దకే వెళ్లి బీపీ, షుగర్, హిమగ్లోబిన్, రొమ్ము, నోటి క్యాన్సర్ పరీక్షలు నిర్వహించాలని జిల్లా నోడలాఫీసర్ డాక్టర్ రఘు వైద్య సిబ్బందిని ఆదేశించారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణంలో జరుగుతున్న సంచార వైద్య చికిత్స కార్యక్రమాన్ని సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రఘు మాట్లాడుతూ ఏవైనా అనారోగ్య లక్షణాలుంటే ఉచితంగా మందులను కూడా వైద్య సిబ్బంది అందజేస్తారన్నారు. అంతకుముందు మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో పలువురు మహిళలు వైద్య చికిత్సలు చేయించుకుని ఉచితంగా మందులు పొందారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మదన్‌శేఖర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య సేవలను పరిశీలిస్తున్న జిల్లా నోడలాఫీసర్ డాక్టర్ రఘు

వధశాలకు తరలిస్తున్న గోవుల పట్టివేత

కోడుమూరు రూరల్: పత్తికొండ నుంచి రెండు వాహనాల్లో వధశాలకు తరలిస్తున్న ఆవులు, కోడెదూడలను సోమవారం కోడుమూరులో విశ్వహిందూ పరిషత్ నాయకులు పట్టుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌ను తరలించారు. పోలీసుల విచారణలో గోవులను వధశాలకు తరలిస్తున్నట్లు తేలడంతో కోడుమూరు పోలీసులు పట్టుబడిన 6 ఆవులు, 4 కోడెదూడలను కర్నూలులోని గోసంరక్షణశాలకు తరలించారు. కాగా గోవధ నిషేధ చట్టం అమలులో ఉన్నా కొందరు వ్యాపారులు గోవులను వధశాలకు తరలించడం దారుణమని, అధికారులు స్పందించి వధశాలకు గోవులను తరలించే వారిపై చర్యలు తీసుకోవాలని విశ్వహిందూ పరిషత్ నాయకులు నాగేశ్వరరావు, కిరణ్, నటరాజ్, కిరణ్‌నాయుడు, అరవింద్ డిమాండ్ చేశారు.



గోవులను తరలిస్తూ పట్టుబడిన వాహనాలు

భూముల సర్వేలకు రైతులు సహకరించాలి

సి.బెళగల్: మండల పరిధిలో జరుగుతున్న భూముల రీసర్వేకు రైతులు సహకరించాలని రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లు కోరారు. సోమవారం ఆయన 18వ బ్లాక్‌లోని సర్వే నెంబర్ 341లో చేపట్టిన సర్వే పనులను తనిఖీ చేశారు. సర్వే పనులు జరిగే ప్రదేశాల్లోని రైతులు తప్పకుండా హాజరు కావాలని, ఇందుకు సర్వే అధికారులు ముందురోజే సంబంధిత రైతులకు తెలియజేయాలని సూచించారు. సర్వేలో ఏవైనా లోపాలు ఉంటే సర్వే అధికారుల దృష్టికి తీసుకువచ్చి సరి చేసుకోవాలని సూచించారు. వీఆర్వో శేఖర్ పాల్గొన్నారు.

రేపు జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు

ఓర్వకల్లు : మండల కేంద్రమైన ఓర్వకల్లులో బుధవారం జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు ఇంతియాజ్‌బాషా సోమవారం తెలిపారు. గ్రామంలోని హజరత్ సయ్యద్ సుల్తాన్ మహమూద్‌షా ఖాద్రీ ఉరుసు సందర్భంగా పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పోటీలలో గెలుపొందిన జట్లకు తొలి నాలుగు స్థానాలకు వరుసగా రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.వెయ్యిల చొప్పున నగదు బహుమతులను అందజేస్తామన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు రూ.200 లు ప్రవేశ రుసుం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 90522 16511 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

హౌసింగ్ ఏఈ కార్యాలయం మార్పు

కల్లూరు : కల్లూరు హౌసింగ్ ఏఈ కార్యాలయాన్ని బిర్లాగేట్‌లోని సంక్షేమ భవన్‌లో హౌసింగ్ డీవైఈఈ కార్యాలయం నుంచి మండల పరిషత్ ఆవరణలో పాత భవనంలోకి మార్చినట్లు హౌసింగ్ ఏఈ శ్రీనాథ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇకపై ఎంపీపీ ఆరవణలోని పాత కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటామని పేర్కొన్నారు. మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు, ప్రజాప్రతినిధులు గమనించాలన్నారు.

పీజీఆర్ఎస్‌కు అధికారుల గైర్హాజరు

సి.బెళగల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు పలువురు మండల స్థాయి అధికారులు గైర్హాజరయ్యారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తం, ఏఓ మల్లేష్‌కుమార్ మత్రామే హాజరయ్యారు. 11 గంటలకు ఎంపీడీఓ రాణెమ్మ హాజరవగా మిగతా అధికారులెవ్వరూ అటువైపు తొక్కిచూడకపోవడంతో వివిధ సమస్యలతో వచ్చిన ప్రజలు చేసేదేమీ లేక వెనుదిరిగారు.

కూలీల సంఖ్య పెంచండి

ఓర్వకల్లు: జాతీయ ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్య పెంచాలని ఎంపీడీఓ శ్రీనివాసులు సూచించారు.సోమవారం మండలంలోని శకునాల గ్రామం వద్ద చేపట్టిన ఉపాధి హామీ పనులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కూలీల మస్టర్లను పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ కొలతల ప్రకారం పనుల చేపట్టి గరిష్ట వేతనం పొందాలని సూచించారు. జాబుకార్డు కల్గిన కూలీలందరికీ పనులను కల్పించేలా ప్రణాళికలు రూపొందించాలని సిబ్బందికి సూచించారు. రోజుకు కనీసం 4 గంటలు పనిచేయాలని, వేసవి దృష్టిలో పెట్టుకొని ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు పనులు చేయాలని సూచించారు. ఆయన వెంట ఏపీఓ కుమార్‌సాయినాథ్, ఎఫ్ఏ హరికృష్ణగౌడు ఉన్నారు.

పేదల ఇళ్ల స్థలాల కోసం పోరాటం

కల్లూరు : కర్నూలు నగరంలో ఏళ్లగా సొంత ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్న పేదలకు ఇళ్ల స్థలాల కోసం సీపీఎం నాయకులు 2వేల మంది పేదలతో జెండాలు పట్టుకుని కల్లూరు 70/2బీ సర్వే నెంబర్‌లోని ప్రభుత్వ స్థలంలో జెండాలు పాతారు. సోమవారం సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నిర్మల, పీఎస్ రాధాకృష్ణ, ఎండి. ఆనంద్‌బాబు, రాముడు, నగర కార్యదర్శి రాజశేఖర్ నాయకత్వంలో ప్రజలతో కలసి కంప చెట్లు కొట్టి, చదును చేసి భూమిని స్వాధీనం చేసుకున్నారు. సీపీఎం నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పేదలకు రెండు సెంట్ల స్థలం ఇచ్చి ఇళ్లు నిర్మించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గురు శేఖర్, నగేష్, అలివేలమ్మ, అరుణమ్మ, నరసింహులు, సాయిబాబా, రామకృష్ణ, అబ్దుల్ దేశాయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఆంజనేయులు మాట్లాడతూ అర్హులైన పేదలు అర్జీలు సమర్పిస్తే పరిశీలించి, ప్రభుత్వం ఉత్తర్వుల ప్రకారం గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు, అర్బన్ ప్రాంతంలో రెండు సెంట్ల స్థలం కేటాయిస్తామన్నారు.



పేదలకు ఇళ్ల స్థలాలు కోసం జెండాలు చేత పట్టుకుని వెళ్తున్న సీపీఎం నాయకులు

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ట

ఓర్వకల్లు: మండలంలోని నన్నూరు గ్రామంలో మాతా మారెమ్మ ధ్వజస్తంభ ప్రతిష్టను సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎస్సీ కాలనీలో వెలిసిన అమ్మవారి గుడివద్ద ధ్వజ స్తంభానికి, అమ్మ వారికి గత మూడు రోజులుగా విశిష్ట హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూడో రోజున ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి కాయ కర్పూరాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. టీడీపీ నాయకులు విజయుడు కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ విద్యాసాగర్, ఎంపీడీఓ శ్రీనివాసులు, స్థానిక నాయకులు విశ్వేశ్వరరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీతో అంగవైకల్యం దూరం

సి.బెళగల్: ఫిజియోథెరపీతో అంగవైకల్యం దూరమవుతుందని ఫిజియోథెరపిస్ట్ వీరేష్ అన్నారు. సోమవారం స్థానిక భవితా కేంద్రంలో దివ్యాంగులకు ఫిజియోథెరపీ చేశారు. ప్రతివారం ఉచితంగా నిర్వహించే ఫిజియోథెరపీ శిబిరాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రత్యేక అవసరాలుగల చిన్నారులకు ఐఈఆర్‌టీలు మద్దిలేటి పరికరాలతో విద్యను అందించారు.



ఫిజియోథెరపీ చేస్తున్న వైద్యుడు వీరేష్

వన్య ప్రాణులను సంరక్షించుకుందాం

కర్నూలు కల్చరల్: వన్య ప్రాణులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అటవీ శాఖ డిప్యూటీ రేంజ్ అధికారులు బి.ఓబులేసు, లక్ష్మయ్య అన్నారు. సోమవారం దిన్నెదేవరపాడులోని శ్రీచైతన్య పాఠశాలలో ప్రపంచ వన్య ప్రాణుల దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అటవీ శాఖ అధికారి పి.శ్యామల, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ జి.విజయకుమార్ ఆదేశాల మేరకు వన్య ప్రాణుల దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు అవగాహన కల్పించామన్నారు. ఏపీ స్టేట్ ఆనిమల్ వెల్ఫేర్ బోర్డు సభ్యులు, స్నేక్ కాన్‌ఫ్లిక్ట్ ఇద్రూస్ జంతువులకు మనుషులకు మధ్య సంఘర్షణ, మనుషులకు పాములకు మధ్య సంఘర్షణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అడవిలో అగ్గితో కలిగే నష్టాల గురించి వీడియోల ప్రదర్శనతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు రేణుక, శకుంతలమ్మ, కృష్ణ, నాగేష్, రామచంద్రుడు, సంగ మిత్ర అనిమల్ ఫౌండేషన్ సభ్యులు, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.